క్లుప్తంగా

మృతులకు పేర్ని నాని నివాళి



మచిలీపట్నంటౌన్: నగరంలో సోమవారం మృతిచెందిన వైఎస్సార్ సీపీ సానుభూతిపరుల మృతదేహాలకు మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య (నాని) నివాళులు అర్పించారు. బలరామునిపేటకు చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త కైతేపల్లి ప్రేమ్‌జగన్ తండ్రి బోసు మృతిచెందారు. అలాగే ఉల్లింగిపాలెంకు చెందిన కార్యకర్త జుజ్జువరపు రామచంద్రరావు మృతి చెందారు. ఈ ఇరువురి మృతదేహాలను పేర్ని నాని సందర్శించి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపి పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. నివాళులర్పించిన వారిలో మాజీ మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ, మాజీ డెప్యూటీ మేయర్ లంక సూరిబాబు, కార్పొరేటర్ మాచవరపు రాంప్రసాద్, కోఆప్షన్ సభ్యుడు బేతపూడి రవి, మాజీ కౌన్సిలర్ చిటికెన నాగేశ్వరరావు, నాయకులు చీలి చక్రపాణి, బడే భానుతేజ తదితరులు ఉన్నారు.

స్వచ్ఛాంధ్ర అవార్డు గ్రహీతలకు సన్మానం



చల్లపల్లి: స్థానిక చంద్ర రాజేశ్వరరావు వికాస కేంద్రంలో సోమవారం రాష్ట్ర, జిల్లా స్వచ్ఛాంధ్ర అవార్డు గ్రహీతలను ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ సన్మానించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి అవార్డు దక్కించుకున్న చల్లపల్లి వచ్చే ఏడాది జాతీయ స్థాయిలో గుర్తింపు పొందాలని ఆకాంక్షించారు. స్వచ్ఛ చల్లపల్లి చరిత్రలో నిలిచిపోతుందన్నారు. అవార్డులు గ్రహీతలు చల్లపల్లి సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, కార్యదర్శి పేర్ని వెంకట మాధవేంద్రరావు, సీహెచ్‌సీ సూపరింటెండెంట్ బి.శ్రీనివాస్, గ్రీన్ అంబాసిడర్లు సాంతల జయలక్ష్మి(చల్లపల్లి), సార్లగొంది కోటేశ్వర రావు(మోపిదేవి), నాగాయలంక సర్పంచ్, కార్యదర్శిలను సన్మానించారు. కార్యక్రమంలో డీపీఏ అరుణ కుమారి, నియోజకవర్గ ప్రత్యేక అధికారి పెనుమూడి సాయిబాబు, మండలి వెంకట్రామ్, రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్, స్వచ్ఛ చల్లపల్లి రథసారధులు డాక్టర్ డీఆర్‌కే ప్రసాద్, డాక్టర్ పద్మావతి, ఏఎంసీ చైర్మన్ తోట కనకదుర్గ, ఎంపీడీఓ ఆనందకుమారి, సీఐ కె.ఈశ్వరరావు, ఎస్‌ఐ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థుల సేవలు ఆదర్శనీయం

ఘంటసాలపాలెం(ఘంటసాల): గ్రామాల్లో సామాజిక విజ్ఞాన కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు చేస్తున్న సేవలు ఆదర్శనీయమని ఘంటసాలపాలెం సర్పంచ్ దోనె రజని అన్నారు. మండలంలోని ఘంటసాలపాలెం గ్రామంలో ఆచార్య ఎన్జీ వ్యవసాయ విశ్వవిద్యాలయం వారి గుంటూరు లాంకు చెందిన సామాజిక విజ్ఞాన కళాశాల విద్యార్థినులు గ్రామీణ అవగాహన కృషి విజ్ఞాన అనుభవ కార్యక్రమంలో భాగంగా సోమవారం ఎన్‌ఎస్‌ఎస్ ద్వారా వివిధ సేవా కార్యక్రమాలను నిర్వహించారు. అలాగే ఘంటసాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సంచార వ్యాధులపై అవగాహన కల్పించారు. ఎన్‌ఎస్‌ఎస్ ఇన్‌చార్జి డాక్టర్ వై.బిందు, పీహెచ్‌సీ డాక్టర్ వేమూరి ప్రమోద్ కుమార్, సూపర్‌వైజర్లు, ఫార్మసిస్టు, ఆశ వర్కర్, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా శమీ పత్రార్చన



నాగాయలంక: స్థానిక శ్రీరామ పాదక్షేత్రం ఘాట్‌లోని శ్రీగంగ పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి మండపంలో శివలింగానికి సోమవారం రాత్రి భక్తులచే శమీ పత్రాలతో మహార్చన నిర్వహించారు. స్వామివారి జన్మ నక్షత్రం ఆర్ద్ర విశిష్టత పురస్కరించుకుని మహాదేవుడికి ప్రీతిపాత్రమైన శమీ వృక్ష ఆకులతో వేద పండితుల మంత్రోశ్చరణలతో విశేష అర్చన చేశారు. మహార్చన తదుపరి విశేష అలంకరణ చేసి మంత్రపుష్ప నీరాజనాలు సమర్పించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

కృత్తివెన్నులో భారీ వర్షం

కృత్తివెన్ను: మండలంలో సోమవారం ఉదయం భారీ వర్షం కురిసింది. ఈ వర్షం దాటికి గ్రామాల్లో ప్రధాన రహదారులు నీటి నిల్వలతో నిండిపోవడంతో వాహనదారులకు ఇబ్బంది పడ్డారు. అధికార యంత్రాంగం స్పందించి గ్రామాల్లో డ్రెయినేజీని మెరుగుపరచాలని ప్రజలు కోరుతున్నారు.

కొక్కిలిగడ్డ(మోపిదేవి): మండలంలోని కొక్కిలిగడ్డ, రావివారిపాలెం, వెంకటాపురం తదితర గ్రామాల్లో సోమవారం కురిసిన కొద్ది పాటి వర్షానికే రోడ్లన్నీ నిండిపోయాయి. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

నకిలీ మద్యంపై నిరసన గళం

- ఎక్సైజ్ కార్యాలయాల ఎదుట నిరసన
- నకిలీ మద్యం, బెల్ట్‌షాపులకు అడ్డుకట్ట వేయాలని డిమాండ్



పెడనలో పార్టీ కార్యాలయం వద్ద ర్యాలీగా బయలుదేరుతున్న రాము, హారిక, వైఎస్సార్ సీపీ శ్రేణులు

కోనేరుసెంటర్: తాము అధికారంలోకి వస్తే సంపద సృష్టిస్తాం అంటే ప్రజలు ఏంటో అనుకున్నారు.. కూటమి అధికారంలోకి వచ్చాకగానీ ప్రజలకు అర్థం కాలేదు... సంపద సృష్టిస్తాం అన్నదీ నకిలీ మద్యం రూపంలో వాళ్ల కోసమే తప్ప ప్రజల కోసమో.. రాష్ట్ర అభివృద్ధి కోసమే కాదని అని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య (నాని) ఎద్దేవా చేశారు. నకిలీ మద్యం తయారీని వ్యతిరేకిస్తూ సోమవారం మచిలీపట్నంలోని ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యలయం ఎదుట పేర్ని నాని ఆధ్వర్యంలో నాయకులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ప్లకార్డులు, ఫ్లెక్సీలతో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పేర్ని మాట్లాడుతూ గడిచిన పదహారు మాసాలుగా నకిలీ మద్యం విచ్చలవిడిగా సరఫరా అవుతోందని మండిపడ్డారు. కూటమి నేతలు సొంతంగా ఫ్యాక్టరీలు పెట్టి నకిలీ మద్యం సరఫరా చేస్తూ ఎక్కడా లేని సంపదను సృష్టించుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ప్రభుత్వాన్ని విమర్శించినా, అధికార పార్టీ నాయకులు చేస్తున్న అవినీతి అక్రమాలను ప్రజలకు తెలిసేలా పోస్టింగ్‌లు పెట్టినా, సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేసినా ఆ వ్యక్తితో పాటు అతని కుటుంబ సభ్యులపై కూడా అక్రమ కేసులు పెట్టి కూటమి నేతలు పైశాచిక ఆనందం పొందుతున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో నకిలీ మద్యం తయారుచేస్తున్న వ్యక్తులపై ఎందుకు చర్యలు తీసుకోరని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

'కొల్లు సొల్లు' అంతా ఇంతా కాదు

రాష్ట్రంలో నకిలీ మద్యంపై ప్రజలు మండిపడుతుంటే ఆ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ప్రెస్‌మీట్‌ల ద్వారా చెబుతున్న సొల్లు అంతా ఇంతా కాదన్నారు. నకిలీ మద్యం కేసులో ప్రధాన నిందితుడిగా చెప్పుకుంటున్న జనార్దన్ అనే వ్యక్తి ఆఫ్రికాలో ఉన్నాడని.. అక్కడ నుంచి ముంబాయ్ వచ్చాడని అక్కడ నుంచి గన్నవరం చేరుకోగా పోలీసులు పట్టుకున్నారని కట్టు కథలు అల్లుతుండటం సిగ్గుమాలిన చర్య అన్నారు. జనార్దన్ అనే వ్యక్తికీ, వీళ్లకి ఎలాంటి లాలూచి లేకపోతే అతన్ని ముంబాయ్‌లో పట్టుకోవాలి కదా అని ప్రశ్నించారు. కల్తీ మద్యం తయారుచేసే వ్యక్తికి ఫోనే లేదనడం మరో విడ్డూరమని ఎద్దేవా చేశారు.

యాప్ ద్వారా మందు నాణ్యమైందో లేదో తెలుసుకోవాలనడం విడ్డూరం

మందుబాబులు తాగే మందు నాణ్యమైందో కాదో తెలుసుకోవడానికి ప్రభుత్వం ఒక యాప్ ఇస్తుందనడం విడ్డూరంగా ఉందని పేర్ని నాని విమర్శించారు. కూలి పనులు చేసుకుని క్వార్టర్ బాటిల్ కొనుక్కుని తాగే పేదవాడి దగ్గర మీరు చెప్పే యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవడానికి అతని దగ్గర అంత ఖరీదు గల స్మార్ట్ ఫోన్ ఎక్కడి నుంచి వస్తుందంటూ ప్రభుత్వాన్ని నిలదీశారు. రాష్ట్రంలో బెల్టుషాపులకు అడ్డుకట్ట వేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎక్సైజ్ సూపరింటెండెంట్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో నగర మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ, డెప్యూటీ మేయర్ శీలం భారతి, మాజీ మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ, మున్సిపల్ మాజీ చైర్మన్ షేక్ సిలార్‌దాదా, అర్బన్‌బ్యాంకు మాజీ చైర్మన్ బొర్రా విఠల్, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు లంకే వెంకటేశ్వరరావు, నియోజకవర్గ అధ్యక్షుడు మేకల సుధాకర్ (సుబ్బన్న), కార్పొరేటర్లు, నాయకులు, సర్పంచ్‌లు, మాజీ కౌన్సిలర్లు, మాజీ సర్పంచ్‌లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నకిలీ మద్యంతో ప్రజల ప్రాణాలు బలి

పెడన: నకిలీ మద్యంతో ప్రజల ప్రాణాలను పణంగా పెట్టి కూటమి నేతలు జేబులు నింపుకొంటున్నారని వైఎస్సార్ సీపీ పెడన నియోజకవర్గ ఇన్‌చార్జి ఉప్పాల రాము విమర్శించారు. రాష్ట్రంలో నకిలీ మద్యం తయారీని వ్యతిరేకిస్తూ సోమవారం పెడనలోని పార్టీ కార్యాలయం నుంచి తహసీల్దారు కార్యాలయం వరకు నిరసన ప్రదర్శన చేపట్టారు. ర్యాలీలో నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున నకిలీ మద్యం అరికట్టాలి, ప్రజల ప్రాణాలతో ఆడుకోవద్దు అంటూ నినాదాలు చేశారు. ఇన్‌చార్జి తహసీల్దారు కె.అనిల్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉప్పాల రాము మాట్లాడుతూ రాష్ట్రంలో నకిలీ మద్యం తయారు చేసి బెల్టు షాపుల ద్వారా విక్రయిస్తున్నారని పేర్కొన్నారు. నకిలీ మద్యం కేసులో అరెస్ట్ అయిన టీడీపీ నాయకుడు జయచంద్రారెడ్డిని పార్టీ నుంచి తొలగించడం ద్వారా మీరు నేరాన్ని అంగీకరించినట్లేనని అన్నారు. సీఎం చంద్రబాబు సంపద సృష్టి అంటే ప్రజల ప్రాణాలను హరించే నకిలీ మద్యంతోనా అని ప్రశ్నించారు. ఉమ్మడి కృష్ణాజిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక మాట్లాడుతూ నకిలీ మద్యం కేసులో అరెస్ట్ అయిన జయచంద్రారెడ్డికి చంద్రబాబు సీటు ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. మీ పార్టీ అభ్యర్థిని పక్కకు నెట్టి, జయచంద్రారెడ్డి నుంచి డబ్బులు తీసుకుని టికెట్ ఇచ్చింది నిజం కాదా అని నిలదీశారు. కార్యక్రమంలో పెడన మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారి, వైస్ చైర్మన్ ఎండీ ఖాజా, కృత్తివెన్ను జెడ్పీటీసీ సభ్యులు మైలా రత్నకుమారి, ఎంపీపీలు రాజులపాటి వాణి, సంగా మధుసూధనరావు, పార్టీ జిల్లా ప్రతినిధి గరికపాటి వెంకట రామానాయుడు, కొండవీటి నాగబాబు, ఎంపీటీసీలు, సర్పంచులు, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మచిలీపట్నంలో మాట్లాడుతున్న పేర్ని నాని



ఈఎస్‌కు వినతిపత్రం అందజేస్తున్న మేయర్ వెంకటేశ్వరమ్మ, మాజీ మేయర్, నాయకులు

కుటీర పరిశ్రమగా నకిలీ మద్యం



అవనిగడ్డలో ఎక్సైజ్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

అవనిగడ్డ: కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో నకిలీ మద్యాన్ని కుటీర పరిశ్రమగా మార్చేసిందని వైఎస్సార్ సీపీ పంచాయతీ రాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు సింహాద్రి వెంకటేశ్వరరావు విమర్శించారు. మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు ఆదేశాల మేరకు పార్టీ నాయకులు నిరసన చేపట్టి అవనిగడ్డ ఎక్సైజ్ శాఖ సీఐ గిరిజా కుమార్‌కి వినతిప్రతం సమర్పించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కూటమి నేతల కనుసన్నల్లోనే కల్తీ మద్యం తయారీ పెద్ద ఎత్తున జరుగుతోందన్నారు. రాష్ట్రంలో పెద్ద ఎత్తున బయటపడిన నకిలీ మద్యంపై నిజాలు నిగ్గు తేల్చాలంటే సీబీఐతో దర్యాప్తు చేయించాలని డిమాండ్ చేశారు. నకిలీ మద్యం వల్ల రాష్ట్ర వ్యాప్తంగా ఎందరో ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని విమర్శించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు చింతలపూడి లక్ష్మీనారాయణ, పులిగడ్డ సర్పంచ్ దాసరి విజయ్ కుమార్, ఎంపీటీసీ సభ్యుడు తోట గణేష్, అవనిగడ్డ, మోపిదేవి మండలాల అధ్యక్షులు రేపల్లె శ్రీనివాసరావు, గడికిపాటి వెంకటేశ్వరరావు, పార్టీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి గాజుల జైగోపాల్, నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు చింతపూడి బాల భాస్కరరావు, మండల ఉపాధ్యక్షులు గార్లపాటి గోపీ, బొర్రా రామకృష్ణ, మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ నజీర్ బాషా, కల్చరల్ విభాగం అధ్యక్షుడు యాసం శివ, వేకనూరు గ్రామ కన్వీనర్ తుంగల వేణు, నాయకులు గరికపాటి కృష్ణారావు, పెనుమూడి చంద్రశేఖర్, అన్నపురెడ్డి పరమాత్మ, కొండవీటి నాగరాజు, ముడిమి అయ్యప్ప, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చెత్తను సేంద్రియ ఎరువుగా మార్చండి



మొక్కలు నాటుతున్న కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నంటౌన్: చెత్తను సేంద్రియ ఎరువుగా మార్చి ఇంటి పరిసరాల్లోనే వివిధ రకాల మొక్కలను పెంచడం ద్వారా ప్రతి ఒక్కరూ వారి ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చునని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ పేర్కొన్నారు. నగరంలోని గాంధీనగర్‌లో ఉన్న ఉదయపు నడక మిత్రమండలి భవనంలో సోమవారం ఏపీ యోగా సభ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న యోగా తరగతుల్లో ఆయన తన కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. అనంతరం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ పరిసరాల్లో మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించి పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలన్నారు. ఇంటి అవసరాల కోసం పంటలను సేంద్రీయంగా పండించుకోవచ్చన్నారు. సేంద్రీయ ఎరువులతో పండించిన పంటలను ఆహారంగా స్వీకరిస్తే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో యోగా గురువులు మద్దాల చింతయ్య, వడ్డే శ్రీనివాస్, యోగ సభ్యులు సమాచార శాఖ డీడీఎం వెంకటేశ్వర ప్రసాద్, ఆర్ దుర్గ ప్రసాద్, జగన్‌మోహన్‌రావు, అశోక్ మాస్టర్ తదితరులు పాల్గొన్నారు.

రూ.7.50 కోట్లతో ప్రతిపాదనలు

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలో ఆరు చిన్న నీటిపారుదల వనరులను రూ. 7.50కోట్లతో పునరుద్ధరించేందుకు ప్రతిపాదిస్తున్నట్లు కలెక్టర్ డీకే బాలాజీ తెలిపారు. జిల్లా స్థాయి అమలు పర్యవేక్షణ కమిటీ సమావేశం సోమవారం జిల్లా పరిషత్ సీఈవో చాంబర్‌లో నిర్వహించారు. జలవనరుల మరమ్మతులు, పునరుద్ధరణ తదితర కార్యక్రమాలు, ప్రతిపాదనలు రాష్ట్ర స్థాయి నోడల్ ఏజెన్సీ ద్వారా కేంద్ర ప్రభుత్వానికి పంపేందుకు సమావేశంలో ఆమోదం తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని నీటి వినియోగ సంఘాల ప్రతినిధులను సంప్రదించి వారి అవసరం మేరకు గన్నవరం మండలంలోని వెదురుపావులూరు, పురుషోత్తపట్నం, వీరపనేనిగూడెం, చిక్కవరం గ్రామాల్లో చెరువులు, బాపులపాడు మండలంలోని కొయ్యూరు, వీరవల్లి గ్రామంలోని చెరువులను పునరుద్ధరించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. జలవనరుల శాఖ ఎస్‌ఈ మోహనరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ సోమశేఖర్, డ్వామా పీడీ ఎన్‌వీ శివప్రసాద్ పాల్గొన్నారు.

జలజీవన్ పథకంతో సురక్షిత తాగునీరు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ బాలశౌరి, చిత్రంలో కలెక్టర్ బాలాజీ

చిలకలపూడి(మచిలీపట్నం): జలజీవన్ పథకం ద్వారా కృష్ణానది నుంచి నేరుగా పైప్‌లైన్ ఏర్పాటుతో జిల్లాలో ఇంటింటికీ సురక్షిత తాగునీటిని అందించేందుకు డీపీఆర్ తయారు చేయాలని ఎంపీ వల్లభనేని బాలశౌరి అధికారులకు సూచించారు. జిల్లా పరిషత్ సమావేశపు హాలులో సోమవారం జిల్లా అభివృద్ధి, సమన్వయ పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశం నిర్వహించారు. ఎంపీ మాట్లాడుతూ ఆయా శాఖల జిల్లా అధికారులు కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రత్యేక దృష్టిసారించి లబ్ధిదారులు సద్వినియోగం చేసుకునే విధంగా కృషి చేయాలన్నారు. కలెక్టర్ బాలాజీ మాట్లాడుతూ కొరమేను పెంపకంలో ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు పొందేలా రైతులను ప్రోత్సహించాలని అధికారులకు సూచించారు. సమావేశంలో జేసీ నవీన్, జెడ్పీ సీఈవో కె.కన్నమనాయుడు, డెప్యూటీ సీఈవో ఆర్‌సీ ఆనంద్‌కుమార్, అధికారులు పాల్గొన్నారు.

నేడు జీఎస్టీపై అవగాహన

గూడూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మధ్యాహ్నం రెండు గంటలకు సూపర్ జీఎస్టీపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ పి.శైలజా కుమారి తెలిపారు. ఈ సదస్సుకు స్థానిక ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది హాజరుకావాలని ఆమె కోరారు.

ముక్కొల్లులో ఫీవర్ సర్వే

గూడూరు: వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలని మల్లవోలు పీహెచ్‌సీ హెల్త్ అసిస్టెంట్ సుబ్రహ్మణ్యం సూచించారు. మండలంలోని ముక్కొల్లు పంచాయతీ పరిధిలో సీజనల్ వ్యాధులపై సోమవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఫీవర్ సర్వే నిర్వహించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతోపాటుగా కాచి చల్లార్చిన నీటిని తాగాలని చెప్పారు. ఏఎన్‌ఎం కోమలి, ఆశ వర్కర్ పద్మ పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

బంటుమిల్లి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందజేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాదు సూచించారు. స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో సోమవారం 8వ పౌష్టికాహార మాసోత్సవం నిర్వహించారు. సీడీపీఓ ఎం.సముద్రవేణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ పౌష్టికాహారంతోనే పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు. ఎంపీపీ వి.చినబాబు, తహసీల్దార్ కేవీ పూర్ణచంద్రరావు, ఎంపీడీఓ నీరజాక్షి, ఎంఈఓ ఎ.వెంకటేశ్వరరావు, పలువురు సర్పంచ్‌లు, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అనారోగ్యంతో యాచకురాలు మృతి

బంటుమిల్లి: స్థానిక ఆర్టీసీ బస్‌స్టాండు ఆవరణలో కొద్ది రోజులుగా అనారోగ్యంతో ఉన్న యాచకురాలు ఆదివారం రాత్రి మృతిచెందింది. సహచర యాచకుడు గుంటూరు జిల్లా, రేపల్లెకు చెందిన కట్టా ఏసు సమాచారం మేరకు.. మృతురాలు కట్ట అంజలని, మచిలీపట్నంలో అతనికి పరిచయం అయ్యింది. ఆ పరిచయంతో బిక్షాటన చేస్తూ ఇద్దరు బంటుమిల్లి వచ్చారు. అంజలి గత కొద్ది రోజులుగా కామెర్ల వ్యాధితో అనారోగ్యానికి గురైంది. సరైన వైద్యం అందక ఆమె మృతిచెందింది. గుర్తు తెలియని మృతదేహంగా పంచాయతీ సిబ్బంది సోమవారం ఖననం చేశారు. ఈ సంఘటనపై ఎటువంటి కేసు నమోదు కాలేదని పోలీసులు తెలిపారు.

ముళ్లకంప తొలగించండి

మోపిదేవి: మండల కేంద్రం మోపిదేవి స్మశాన వాటికలో ముళ్లకంప, పిచ్చిమొక్కలను తొలగించాలని కోరుతూ మీ కోసంలో తహసీల్దార్ ఎం.హరనాథ్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన మీకోసంలో కోసూరు రామాంజనేయులు మోపిదేవి స్మశాన వాటికలో నెలకొన్న సమస్యలను వివరించారు. మృతదేహాల దహన సంస్కారాలకు కనీస మౌలిక సదుపాయాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని విన్నవించారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం

చల్లపల్లి: మండలంలోని ఆముదార్లంక ఇసుక క్వారీ నుంచి సోమవారం ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పీఎస్‌వీ సుబ్రహ్మణ్యం తెలిపారు. అందిన సమాచారం మేరకు ఎస్‌ఐ తన సిబ్బందితో కలిసి ఆముదార్లంక క్వారీకి వెళ్లగా అప్పటికే ఇసుక లోడుతో ఉన్న రెండు ట్రాక్టర్లను గుర్తించి వాటిని చల్లపల్లి పోలీస్టేషన్‌కు తరలించినట్లు వివరించారు. అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తే కేసులు నమోదు చేస్తామని ఎస్‌ఐ హెచ్చరించారు.

బాణసంచా సీజ్

కోడూరు: అనుమతులు లేకుండా విక్రయిస్తున్న బాణసంచాను కోడూరు పోలీసు, రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. కోడూరు పంచాయతీలోని మూడవ వార్డుకు చెందిన కోడూరు వెంకట పాండురంగారావు తన నివాస గృహంలో టపాసులు విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో దాడి చేసినట్లు ఎస్‌ఐ చాణిక్య తెలిపారు. ఈ దాడుల్లో రూ.58,500 విలువ గల బాణసంచాను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఏవిధమైన లైసెన్స్ పొందకుండా టపాసులను నివాస గృహాల వద్ద విక్రయించడం చట్టరీత్యా నేరమని, పాండురంగారావుపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ పేర్కొన్నారు. ఈ దాడుల్లో తహసీల్దార్ సౌజన్య కిరణ్మయి, ఆర్‌ఐ సుభాషిణి, సిబ్బంది పాల్గొన్నారు.

నవంబర్ 29న భగవద్గీత పోటీలు

మచిలీపట్నంటౌన్: టీటీడీ, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కృష్ణాజిల్లా శాఖ ఆధ్వర్యంలో శ్రీమద్ భగవద్గీతపై వివిధ రకాల పోటీలు నిర్వహిస్తున్నట్లు ప్రోగ్రాం అసిస్టెంట్ సీవీకే ప్రసాద్ సోమవారం ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలను నగరంలోని బచ్చుపేట శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో నవంబర్ 29, 30, డిసెంబర్ ఒకటవ తేదీన 18 నుంచి 45 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న వారికి నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. విజేతలకు నగదు బహుమతి, ధ్రువీకరణ పత్రాలు అందజేస్తామని అన్నారు. ఆసక్తి గల వారు 98490 68424 నంబర్‌ను సంప్రదించాలని ఆయన సూచించారు.

41 నోటీసులకు వివరణ ఇచ్చిన వైఎస్సార్ సీపీ నాయకులు



కోనేరుసెంటర్: వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన 'ఛలో మెడికల్ కళాశాల' కార్యక్రమంలో పాల్గొన్న పార్టీ నాయకులు, కార్యకర్తలకు మచిలీపట్నం పోలీసులు జారీ చేసిన 41 నోటీసులకు సోమవారం వారు వివరణ ఇచ్చారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య (నాని) ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు 30 మందికిపైగా స్టేషన్‌కు చేరుకున్నారు. పోలీసులు కోరిన విధంగా నోటీసులో పొందుపరిచిన అంశాలకు సహకరిస్తామని తెలుపుతూ వివరణ ఇచ్చారు.

విద్యార్థినులకు లక్ష్మీశారద ఫౌండేషన్ ప్రోత్సాహకాలు



కాలేజీకి ప్రింటర్, స్కానర్, కాపియర్ అందిస్తున్న ఫౌండేషన్ సభ్యులు

మచిలీపట్నంఅర్బన్: ప్రార్థించే పెదవుల కన్నా సాయం చేసే చేతులు మిన్న అని లేడీ యాంప్తిల్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పి.లక్ష్మి పేర్కొన్నారు. పేద కుటుంబాలకు చెందిన బాలికల విద్యాభివృద్ధే లక్ష్యంగా లక్ష్మీశారద గోపాలరత్నం ఫౌండేషన్ లేడీ యాంప్తిల్ బాలికల జూనియర్ కాలేజీ విద్యార్థినులకు సోమవారం స్కాలర్‌షిప్‌లు అందజేసింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రమశిక్షణ కలిగి ఉండాలని సూచించారు. 2015లో కేవలం రెండు అవార్డులతో ప్రారంభమైన ఫౌండేషన్, ప్రస్తుతం మొత్తం 18 మందికి స్కాలర్‌షిప్‌లు ప్రదానం చేస్తోందన్నారు. ప్రతి విభాగంలో మొదటి, రెండవ స్థానంలో ఉన్న విద్యార్థినులకు అవార్డులు అందజేశారని చెప్పారు. ఫౌండేషన్‌కు పదేళ్లు పూర్తయిన సందర్భంగా కాలేజీకి ప్రింటర్, స్కానర్, కాపియర్ యంత్రాన్ని బహూకరించారు. కార్యక్రమంలో ట్రస్టీలు ఎ.అనసూయ, ఎ.రామమూర్తి, ఎస్.ఎస్.ఆర్.వై.శర్మ, అధ్యాపకులు లంకిశెట్టి హరనాథ్ బాబు, సురేష్ మున్వర్, శిరీష, విద్యార్థినులు పాల్గొన్నారు.

జీవన ఎరువులతో నేల సారవంతం



జీవన ఎరువుల తయారీపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ వెంకటలక్ష్మి

ఘంటసాల: జీవన ఎరువుల వాడకం వల్ల నేలలో సారవంతం పెరుగుతుందని కేవీకే సస్యపోషణ శాస్త్రవేత్త డాక్టర్ ఎం.వెంకటలక్ష్మి అన్నారు. ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వారి ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం ప్రాంగణంలో శాస్త్రవేత్తలు డాక్టర్ వెంకటలక్ష్మి, డాక్టర్ కె.రేవతి ఆధ్వర్యంలో సోమవారం జీవన ఎరువుల అవగాహన వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకటలక్ష్మి మాట్లాడుతూ జీవన ఎరువులను వివిధ పంటల్లో తక్కువ ఖర్చుతో వినియోగించుకోవచ్చన్నారు. తద్వారా నేలలో సూక్ష్మజీవులు పెరిగి ఆయా పంటలకు పోషకాలను అందిస్తాయని తెలిపారు. కేవీకే పరిధిలోని రైతులందరూ జీవన ఎరువులు వాడకానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్త జి.కృష్ణ, రైతులు, మహిళా రైతులు పాల్గొన్నారు.

విధుల్లో చేరిన నూతన ఉపాధ్యాయులు



చెన్నూరులో నూతన ఉపాధ్యాయులతో హెచ్‌ఎం ఆంజనేయులు

నాగాయలంక: డీఎస్సీ-2025 ద్వారా ఉద్యోగాలు సాధించిన 23మంది ఉపాధ్యాయులు మండలంలోని వివిధ పాఠశాలలలో సోమవారం విధుల్లో చేరినట్లు ఎంఈఓ సనకా శ్రీకాంత్ తెలిపారు. కొత్తగా విధుల్లో చేరిన నూతన ఉపాధ్యాయులకు ఎంపీపీ భోగాది రాఘవరాణి, ఎంఈఓలు శ్రీకాంత్, అన్నపరెడ్డి రామారావు అభినందనలు తెలిపారు.

పెడన: మండలంలోని వివిధ పాఠశాలల్లో 14 మంది నూతన ఉపాధ్యాయులు విధుల్లో చేరినట్లు ఎంఈవో-1 ఎస్.సలోమి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

మోపిదేవి: మండలానికి కేటాయించిన మొత్తం 14 మంది ఉపాధ్యాయులు విధుల్లోకి చేరినట్లు ఎంఈవోలు గోపాల్, వెంకట రమణ సోమవారం తెలిపారు.

ఘంటసాల: ఘంటసాల మండలంలోని వివిధ పాఠశాలల్లో 13 మంది నూతన ఉపాధ్యాయులు విధుల్లో చేరినట్లు ఎంఈవో ఎస్.శివశంకరరావు తెలిపారు. నూతన ఉపాధ్యాయులు సమర్థవంతంగా విధులు నిర్వహించాలని ఆయన సూచించారు.